ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 29 జనవరి 2025




'నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్నవారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయకుండా అమెరికాలో మనుగడ కష్టం. మా తల్లిదండ్రులు అప్పు చేసి నన్ను అమెరికాకు పంపించారు. నా ఖర్చులకు నెలనెలా డబ్బులు పంపించే స్థోమత వారికి లేదు. నేనే పార్ట్‌టైమ్‌గా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఏడాది కాలంగా చదువుకుంటున్నా. ప్రస్తుతం తనిఖీలు ఎక్కువయ్యాయి.. పోలీసులకు దొరికితే డిపోర్టేషన్ (స్వదేశానికి పంపించటం) చేస్తున్నారు. అందుకే ఆ పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని తాత్కాలికంగా మానేశా. ఆర్థికంగా ఎలా అడ్జెస్ట్ అవుతుందోనని ఆందోళనగా ఉంది'

- శాన్ ఆంటోనియా రాష్ట్రంలో ఉండే వరంగల్ విద్యార్థి ఆవేదన



'ఐదారు రోజులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో నేను, నా స్నేహితుడు పార్ట్ టైమ్ ఉద్యోగం మానేశాం. రెస్టారెంట్ యజమాని కూడా మమ్మల్ని ఉద్యోగంలోకి రావొద్దని చెప్పారు. రిస్క్ తీసుకుని వేరే కంపెనీలో జాబ్‌కు వెళ్లి మా స్టూడెంట్ వీసాను కోల్పోలేం. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది'

- డల్లాస్‌లో ఉండే మరో విద్యార్థి

● అమ్మో..రికా

# మనోళ్లలో.. డిపోర్టేషన్ భయం!

ట్రంప్ ఆంక్షలతో అగ్రరాజ్యంలోని ఓరుగల్లు విద్యార్థుల్లో ఆందోళన

- చదువుతూ.. పార్ట్‌టైమ్ చేసే వారికి గండమేనని ప్రచారం
- నిబంధనల ప్రకారం క్యాంపస్‌లో వారంలో 20గంటలే జాబ్ చేసుకునే అవకాశం
- పార్ట్‌టైం జాబ్స్ చేయకుండా అమెరికాలో ఉండటం కష్టమంటున్న విద్యార్థులు
- ఉమ్మడిజిల్లా నుంచి చదువుల కోసం అమెరికాకు ఐదారు వేల మందికి పైగా పయనం
- తగిన పత్రాలు లేకుండా.. అక్రమంగా ఉంటున్నవారిలో గుబులు

యువత డాలర్ డ్రీమ్స్‌పై ట్రంప్ పిడుగు పడుతోంది. అమెరికాలో చదువుకుంటూ.. పార్ట్‌టైమ్ జాబ్‌పై నెట్టుకొస్తున్న వారికి డిపోర్టేషన్ (స్వదేశానికి పంపడం) భయం వెంటాడుతోంది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇమ్మిగ్రేషన్‌పై కొరడా ఝుళిపిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి నుంచి సుమారు 6వేల మందికిపైగా అమెరికాకు వెళ్లినట్టు అంచనా ఉండగా.. వీరిలో చాలామంది చదువుతూనే పార్ట్‌టైమ్ జాబులు చేసుకుంటున్నారని సమాచారం. అయితే ఎఫ్ 1 వీసాపై యూఎస్‌లో వారానికి 20గంటలే పార్ట్‌టైమ్ చేసుకోవాలని.. అది కూడా వారి క్యాంపస్‌లోనేననే నిబంధన ఉంది. కానీ చాలామంది విద్యార్థులు గ్రాసరీస్టోర్స్, బంకులు, రెస్టారెంట్లతో పాటు వివిధ కంపెనీల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలపై ఆధారపడ్డారని.. ఇప్పుడు కొత్త అధ్యక్షుడి నిర్ణయాలతో వారిని భయం వెంటాడుతోందని తెలుస్తోంది.

7

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి




## సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కదలిక

- 31న ఆస్పత్రి నిర్మాణం, వైద్య సేవలపై అధికారులతో సీఎం సమీక్ష
- కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎంను కలిసిన ఓరుగల్లు ఎమ్మెల్యేలు
- మడికొండ డంపింగ్ యార్డు గురించి వివరించిన ప్రజాప్రతినిధులు

7



సీఎంను కలిసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల బృందం

గార్ల తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు 6

## రాకపోకలకు కష్టాలే!



మూసి వేస్తున్నట్లు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

- మానుకోటలో మూసివేయనున్న రైల్వే అండర్ బ్రిడ్జీ
- మూడోలైను నిర్మాణ పనులు ముగిసే వరకూ తిప్పలే..
- ఇక రైల్వేగేట్, ఆర్వోబీల ద్వారా పాత, కొత్త బజారులకు ప్రయాణాలు
- రైల్వే అండర్‌పాస్‌లను వినియోగంలోకి తేవాలని డిమాండ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్యూబీ)ని మూసి వేయనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 20 వరకు బంద్ చేస్తున్నట్లు ఇప్పటికే రైల్వే అధికారులు ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఆర్యూబీ వద్ద ఉత్తర్వుల కాపీని అంటించారు. ఇంకా ఆర్యూబీ వద్ద పనులు జరగకపోవడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. ఏ రోజైనా అందులో నుంచి రాకపోకలు నిలిచిపోనున్నాయి. నిత్యం పాత, కొత్త బజారులకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కో నున్నారు. ఆర్యూబీని మూసివేస్తే ఇక పాత, కొత్త బజారులకు వెళ్లాలంటే పట్టణంలో ఉన్న ఏకైక రైల్వేగేట్ నుంచి లేదా రైల్వే ఓవర్ బ్రిడ్జీ (ఆర్వోబీ) మీదుగా రాకపోకలు కొనసాగించాలి. రైలు వచ్చే సమయంలో రైల్వేగేట్ పడితే ఇక పట్టణ శివార్లలో ఉన్న రైల్వేఓవర్ బ్రిడ్జీ (ఆర్వోబీ) మీదుగా వెళ్లాలంటే దాదాపుగా 4 కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఫిబ్రవరి 20 వరకు రైల్వేగేట్ మూసి వేస్తామని ఇప్పటికే రైల్వే అధికారులు ప్రకటించడంతో ఆర్యూబీ వద్ద మూడోరైల్వే పనులు ముగిసి తెరిచేంత వరకు ప్రత్యామ్నాయంగా నిరుపయోగంగా ఉన్న అండర్ పాస్‌లను ముందస్తుగా వినియోగంలోకి తీసుకురావాలని వామపక్ష పార్టీలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు

### ఆర్యూబీ మూసివేత నేపథ్యంలో..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే మూడోలైన్ పనుల నేపథ్యంలో ఆర్యూబీ మార్గాన్ని మూసివేస్తే వాహనదారులకు తిప్పలు తప్పవు. వివిధ పనుల నిమిత్తం తరుచుగా పాత, కొత్త బజారులకు వెళ్లే వాహనదారులకూ కష్టాలే! పట్టణంలో ఉన్న ఏ క్యాబిన్ రైల్వే గేట్ లేదా దూర ప్రాంతంలో కురవి రోడ్‌లో ఉన్న ఆర్వోబీని ఆశ్రయించక తప్పదు. దినదినాభివృద్ధి చెంది మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా ఆవిష్కృతం కావడంతో నిత్యం జిల్లా నలుమూలల నుంచి పట్టణానికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, వాహనదారులు రోజురోజుకు పెరుగుతూ వస్తున్నారు. మానుకోట జిల్లా కేంద్రం సైతం అనేక కాలనీలతో విస్తరించి దాదాపుగా లక్ష జనాభాకు చేరువైంది. వివిధ పనులు, ఉద్యోగ విధులు, ఆస్పత్రులు, కిరాణ, ఇతరత్రా సామగ్రి కొనుగోలు రీత్యా పట్టణ ప్రజలు వేలాది మంది తమ వాహనాల ద్వారా ఆర్యూబీ మార్గం గుండా కొత్త, పాత బజారులకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరికి తోడు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారు సైతం ఆ మార్గం గుండానే వెళ్తుంటారు. ఆర్యూబీ మూసి వేయడం, రైలు వచ్చే సమయంలో ఏకైక రైల్వేగేట్ మూసివేస్తే



అనంతారం రోడ్‌లో నిరుపయోగంగా ఉన్న రైల్వే అండర్‌పాస్



మహబూబాబాద్ సిగ్నల్‌కాలనీ వద్ద రాకపోకలు లేని రైల్వే అండర్ పాస్

మిగతా 8వ పేజీలో...

కేసముద్రం మునిసిపాలిటీకి

## తొలి కమిషనర్‌గా ప్రసన్నరాణి



కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీకి తొలి కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతోప్రసన్నరాణి మంగళవారం కేసముద్రం స్టేషన్ జీపీ కార్యాలయంలో విధుల్లో చేరారు. గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీలో ఉప కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను ఇక్కడికి ఎఫ్‌ఏసీగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి, సొసైటీ వైస్‌ఛైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్ రావు, జీపీ సిబ్బంది వేర్వేరుగా పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు.

### తొర్రూరు ప్రత్యేకాధికారిగా లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు, (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కలవడం జరిగిందని, మునిసిపాలిటీ సమస్యలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలు వివరించగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చేపట్టాల్సిన పనులు చేయాలని ఆదేశించారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

## ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్‌గౌడ్



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ప్రిన్సిపాల్స్‌కు అవగాహన కల్పిస్తున్న మదార్‌గౌడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 29న మానవతా నైతిక విలువలు, 30న పర్యావరణ విద్య, 31న ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలను ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని, మార్కులు ఆన్‌లైన్‌లో పొందుపరిచేటప్పుడు చాలా జాగ్రత్తగా చూసుకొని సబ్‌మిట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కురవి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో అభ్యసన, సామర్థ్యాలు పెంపొందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. నేరడలో కేజీబీవీ, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులను సూచించారు. కేవలం పాస్ మార్కుల వరకే పరిమితం కాకుండా.. ఫస్ట్‌క్లాస్ పాస్ కావాలని అన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, వంటగది, ఆహార పదార్థాలు, మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కోర్సుల గురించి వారికి వివరించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో అమలు చేస్తున్న మెనూచాట్ ప్రకారం ఖచ్చితంగా వడ్డించాలని, విద్యార్థులకు పోషకాహారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట పగిడిపల్లి లలిత, ప్రత్యేక అధికారి సరస్వతి ఉన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిన్నగూడూరు, (ఆంధ్రజ్యోతి) : ప్రణాళిక బద్ధంగా చదివి, ఉత్తమ పలితాలు సాధించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. చిన్నగూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ అభ్యసన సామర్థ్యాలు పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారిని ఉత్తేజపరిచారు. విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతిగృహాల్లో అమలు చేస్తున్న మెనూ చాట్ ఖచ్చితంగా పాటించాలని, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం అందించాలన్నారు. అనంతరం పాఠశాలల పరిసర ప్రాంతాలు, వంటగదులు, ఆహారపదార్థాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో లలిత, స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, ఉపాధ్యాయులు, వసతి గృహ వార్డెన్లు పాల్గొన్నారు.



కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలు అందరూ పాటించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి నెహ్రూసెంటర్, మదర్ థెరిస్సా, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్ రోడ్డు, వైఎస్సార్ విగ్రహం సెంటర్ మీదుగా రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రోడ్డు భద్రత వారోత్సవాలను మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతనే ఉందని చెప్పారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వలన కుటుంబానికి జరిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని, అందరూ జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతకు ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని గుర్తు చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే స్పందించి, సాయం చేస్తు న్న శ్రీనివాస్ అనే యువకుడికి సన్మానం చేసి, హెల్మెట్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు పెండ్యాల దేవేందర్, సర్వయ్య, చంద్రమౌళి, సత్యనారాయణ, రవి, వెంకటేశ్వర్లు, శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

### హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి : సీఐ

గూడూరు, (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని గూడూరు సీఐ సూర్యప్రకాష్ అన్నారు. గూడూరులో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా వానదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలలకు ద్విచక్రవాహనాలను ఇవ్వొద్దని, 18 సంవత్సరాలు పైబడి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలను నడపాలని చెప్పారు. వాహనాలను నడిపే సమయంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ములుగులో నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

## యూపీఎస్‌పై ఉద్యోగుల నిరసన

### టీఎస్సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఉత్తర్వుల కాపీ దహనం

ములుగు కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానంపై జారీ చేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనం ఎదుట ఉద్యోగులు మంగళవారం నిరసనకు దిగారు. తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో యూపీఎస్ ఉత్తర్వు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, ప్రధాన కార్యదర్శి మంకిడి రవిలు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దశాబ్దకాలంగా పోరాటం చేస్తుంటే ఇప్పుడు కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని దుయ్యబట్టారు. ఈవిధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోనున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్రం పునరాలోచించి యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్, నరేష్, పత్తిరి శ్రీధర్, సమ్మయ్య, కుమారస్వామి, అరుణ, సౌమ్య, జయ, ఇందిర, ప్రియదర్శిని, బాలాజీ, రుక్సానా బేగం, అజ్మత్‌పాషా, ఉస్మాన్, సూరయ్య పాల్గొన్నారు.

### చిన్న కాళేశ్వరం

## కాల్వల నిర్మాణానికి సర్వే



ఆదివారంపేటలో సర్వే చేస్తున్న అధికారులు

కాటారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి జీపీల పరిధిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-2 పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేసే మెయిన్, చిన్న కెనాల్స్ నిర్మాణం కోసం అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ డీఐ గంగాధర్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ వినయ్, ఇరిగేషన్ జేఈ వెంకన్న పలువురు రైతులకు చెందిన 45ఎకరాల మేర కెనాల్స్ అలైన్‌మెంట్ కోసం భూములను సర్వే చేశారు. గతంలో ఆదివారంపేట చెరువును రిజర్వాయర్‌గా మారుస్తూ కట్టను వెడల్పు చేసే ప్రక్రియ, పైప్‌లైన్ నిర్మాణం కోసం భూములను సేకరించగా 30మంది రైతులకు 10మందికి పరిహారం రాలేదని సర్వే పనులను అడ్డగించడానికి రైతులు యత్నించారు. కాటారం ఎస్సై అభినవ్ నేతృత్వంలో పోలీసులు వారితో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, పరిహారం అందకుంటే మంజూరు చేయిస్తారని నచ్చజెప్పడంతో వారు తమకు పరిహారం అందించాలని అధికారులను కోరారు. పరిహారం రాకుంటే పనులు జరగనివ్వమని రైతులు తేల్చి చెప్పారు.



# 430 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రాజరాజేశ్వర రైస్‌మిల్లులో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యం బస్తాలను చూపుతున్న ఓఎస్‌డీ ప్రభాకర్

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం అప్పరాజుపల్లి రాజరాజేశ్వర రైస్‌మిల్లులో మంగళవారం తెల్లవారుజామున సివిల్ సప్లై ఓఎస్‌డీ ప్రభాకర్, డీఎస్‌వో ప్రేమ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, సుమారు 430 బస్తాల పీడీఎస్ బియ్యం గుర్తించారు. సిబ్బందితో కలిసి సివిల్‌సప్లై ఓఎస్‌డీ, డీఎస్‌వో సిబ్బందితో కలిసి బియ్యం నమూనాలను సేకరించారు. వాటిని పరీక్షించగా ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ బియ్యమేనని తేలింది. దీంతో రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై ఓఎస్‌డీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పరాజుపల్లి రాజరాజేశ్వర రైస్ మిల్లులో పట్టుబడిన బియ్యం వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేటలోని శివరాం రైస్‌మిల్లుకు తరలిచేందుకు సిద్ధంగా ఉన్నసమయంలో పట్టుకున్నట్లు చెప్పారు. వరంగల్ అధికారులకు సైతం ఆయా మిల్లుల్లో సోదాలు చేసేందుకు సమాచారం అందించారు. పట్టుబడిన బియ్యాన్ని కేసముద్రం ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు. మిల్లు యాజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కొత్తగూడ మండలం నుంచి ఇద్దరు వ్యక్తులు రెండు బైక్‌లపై 3 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకురాగా, వాటిని సైతం స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనాలను సీజ్ చేసి, గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఓఎస్‌వో రమేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు. కాగా, గత సంవత్సరం సెప్టెంబర్ 24న కస్టం మిల్లింగ్ బియ్యం ఇవ్వకపోవడం కారణంగా రాజరాజేశ్వర మిల్లును సీజ్ చేసి, యాజమాని భూక్య నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## 12 ఏళ్లుగా ఎదురుచూపులు

- దొరకని గొర్లవీడువాసి ఆచూకీ
- కుమారుడి కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు
- ఫిర్యాదు చేసినా దక్కని ఫలితం



కొడుకు రాకకోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో) రాజురెడ్డి (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అతడు ఓయూలో చదువుకున్నాడు. తల్లిదండ్రులు కష్టపడి పంపిన డబ్బుతోనే కాలం వెళ్లదీశాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించాడు. ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. రాష్ట్రం వస్తే ఉద్యోగం వస్తుందని కలలు కన్నాడు. ఏమైం దో ఏమో తెలియదు కానీ స్వరాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున్న సాగుతున్న సమయంలో ఉన్నంటుండి అదృశ్యమయ్యాడు. ఎక్కడ ఉన్నాడో తెలియదు.. ఎక్కడికి వెళ్లాడో తెలియదు.. అసలు ప్రాణాలతో ఉన్నాడో లేడో కూడా తెలియదు. దీంతో ఆ వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారుడి కోసం 12ఏళ్లుగా దీనంగా ఎదురు చూస్తున్నారు.

### ఏం జరిగిందంటే..

భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన మందల సుమతి-చిన్న సమ్మిరెడ్డి దంపతుల కుమారుడు మందల రాజురెడ్డి హైదరాబాద్‌లోని ఓయూలో చదివేవాడు. ఆ సమయంలో జరుగుతున్న రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటూ వచ్చేవాడు. ఉద్యమం ఊపందుకున్న సమయంలో 2013లో ఉన్నట్టుండి అదృశ్యమయ్యాడు. ఆ రోజు నుంచి నేటి వరకు కానరాకుండా పోయాడు. తమ కుమారుడు వస్తాడనని నేటికీ తల్లిదండ్రులు వేచి చూస్తుండటం అందరినీ కలచివేస్తోంది. అయితే 2013 నుంచి రాజురెడ్డి ఆచూకీ కనిపించకుండా పోవడంతో తమ కుమారుడు వస్తాడని మూడేళ్లపాటు ఎదురుచూడటంతో పాటు తమకు తోచిన కాడల్లా వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు చివరకు 2017 జూన్ 20న పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి ఆచూకీ కనుగొనాలని వేడుకున్నారు. అయితే, విచారణ చేపట్టి ఆచూకీ కోసం గాలించిన పోలీసులు రాజురెడ్డి ఆచూకీ దొరకడం లేదంటూ 2021 నవంబరు 10న లేఖ ఇచ్చారు. వీరితో పాటు అప్పటి ఆర్డీవో, తహసీల్దార్లు కూడా నాటి కలెక్టర్‌కు నివేదించారు. దాంతో కలెక్టర్ కూడా నాటి చీఫ్ సెక్రటరీకి రాజురెడ్డి 12 ఏళ్లుగా కానరావడం లేదంటూ రిపోర్టు పంపించారు. ఈ క్రమంలో తీవ్ర ఆవేదనకు గురైన తాము తమకుమారుడు మరణించినట్టు ధ్రువీకరణ పత్రమైనా ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నామని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ రాజురెడ్డి తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

### ఆదుకుంటామని కాలయాపన చేసిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం

మందుల రాజురెడ్డి అదృశ్యమయ్యాడని తల్లిదండ్రులు అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున ఏదో విధమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ, అడిగిన ప్రతీసారి ధైర్యాన్నిచ్చేరే గానీ, కాలయాపన చేశారంటూ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని తమ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారని, కనీసం ఉండటానికి ఇళ్లు లేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని రాజురెడ్డి చెల్లెలు మందల మమత కోరారు. ప్రభుత్వం గుర్తించి చేయూతనిస్తే రుణపడి ఉంటామని ఆమె స్పష్టం చేశారు.

## మేడారంలో కలెక్టర్ పర్యటన

### మినీ జాతర ఏర్పాట్ల పరిశీలన



జంపన్నవాగు వద్ద చెక్ డ్యామ్‌లో నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరగనున్న మేడారం మినీ జాతర వేడుకల ఏర్పాట్లను ములుగు కలెక్టర్ దివాకర మంగళవారం సాయంత్రం పరిశీలించారు. నార్లాపూర్ శివారు చింతల్ క్రాస్ జంపన్నవాగును సందర్శించారు. చెక్‌డ్యామ్‌తో పాటు చెక్‌డ్యాంలోని నీటిమట్టాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్ల మరమ్మతులు, రహదారుల ప్యాచ్ వర్కులను, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరిలోగా పనులు పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

### అభ్యుదయ యువజన సంఘం వినతి

మేడారం గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయుడు, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజరావు ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకరకు వినతి పత్రం అందజేశారు. గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### డీడీ గుగులోత్ దేశీరాంనాయక్

నెహ్రూసెంటర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ యువకులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని గిరిజన సంక్షేమ శాఖ మహబూబాబాద్ జిల్లా డీడీ గుగులోతు దేశీరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐటీడీఏ ఏటూరునాగారం, మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ రంగాల్లో నిరుద్యోగ యువత అర్హతలను బట్టి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాకు 910 మంది నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోగా.. 25 ప్రైవేట్ కంపెనీలు హాజరై దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో అర్హులైన 396 మందిని అప్పటికప్పుడే ఆయా జాబ్‌లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు వారి అర్హతలను బట్టి కంపెనీ జీతభత్యాలు నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌బాబు, కిశోర్, శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, కొండల్‌రావు పాల్గొన్నారు.




జాబ్‌మేళాలో మాట్లాడుతున్న డీడీ దేశీరాంనాయక్

### సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఆర్టీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐడీవోసీలో గిరిజన సంక్షేమ కార్యాలయంలో డీడీ దేశీరాంనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సీఆర్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వట్టం శంకర్, కున్సోత్ దేవేందర్, దారావత్ శ్రీను, పోరిక అనిల్, బానోత్ కిషన్, భూక్య మంగీలాల్, బానోత్ రవీందర్,భూక్య దేవేందర్, దారావత్ శ్రీనివాస్, గుగులోతు చిట్టిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | -- | -- |
| పల్లికాయ (సూక) | 6000 | 4600 |
| పల్లికాయ (పచ్చిది) | 5100 | 3100 |
| కందులు | 6521 | 4460 |
| పెసళ్లు | 7133 | 2800 |
| పత్తి | 6940 | 5800 |
| కొత్త పత్తి | -- | -- |
| పసుపు (గోల) | -- | -- |
| తేజ మిర్చి | 14000 | 9000 |
| తేజ ఏసీ | -- | -- |
| వండర్‌హాట్ | 15200 | 11500 |
| యూఎస్341 | 15500 | 11500 |
| తాలు మిర్చి | 6500 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

## కంటైనర్ ఆరోగ్య కేంద్రానికి స్థల పరిశీలన

కన్నాయిగూడెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల అటవీ గ్రామం ఐలాపూర్‌లో కంటైనర్ ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని డీఎంహెచ్‌వో గోపాలరావు మంగళవారం పరిశీలించారు. పల్లెల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. 100 శాతం లక్ష్యాలను సాధించాలని సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలోని చిన్నబోయినపల్లి, కొండాయిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లను తనిఖీ చేశారు.

మం దుల నిల్వలు, ఓపీ రిజిస్టర్లను పరిశీ లించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో జరిగే ఐలాపూర్ సమ్మక్క- సారలమ్మల జాతర సందర్భంగా ఏర్పాటు చేయబోయే మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్లు అభినవ్, ప్రణీత్, అన్విషా, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ఉన్నారు.



కంటైనర్ ఆరోగ్య ఉప కేంద్రం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాలరావు

## భార్యపై అనుమానంతో హత్య

### మూడు రోజుల క్రితం కత్తితో దాడి - చికిత్స పొందుతూ మృతి



సుగుణ మృతదేహం

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానంతో గొడవపడి కత్తితో దాడి చేయగా మహబూ బాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరికి చెందిన వాంకుడోత్ సుగుణ (30) మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సుగుణ భర్త రఘు మద్యం సేవించి అనుమానంతో తరచూ భార్యతో గొడవపడుతుంటాడు. ఈనెల 25న మధ్యాహ్నం భార్యతో రఘు వివాదం పెట్టుకొని క్షణికావేశంలో కర్రతో సుగుణ తలపై కొట్టి, కూరగాయలు కోసే కత్తితో పొట్టలో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సుగుణను అదేరోజు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గూడూ రు మండలం చిన్నఎల్లాపూర్‌కు చెందిన సుగుణ తండ్రి కున్సోత్ హట్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘుపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## పెనుగొండ ఉన్నత పాఠశాల తనిఖీ



పెనుగొండ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం కాలేరు యాదగిరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## అంతర్జాతీయ సదస్సుకు గురునాథరావు..



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈనెల 29వ తేదీ నుంచి 31 వరకు జరగనున్న అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రం సమర్పించేందుకు మహబూబాబాద్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ కమ్యూనికేటర్ గురునాథరావుకు మంగళవారం ఆహ్వానం అందింది. తమిళనాడు టీచర్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ యూనివర్సిటీ, విద్యా ప్రణాళిక పరిపాలన విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు, పరిశోధకులు, విధాననిర్ణేతలను ఒకే వేదికపై తీసుకొచ్చి డిజిటల్ విద్యారంగంలో నూతన మార్గాలను అవగాహన చేసుకునే గొప్ప అవకాశం ఇస్తుంది. జిల్లాకు చెందిన గురునాథరావు డిజిటల్ తరగతుల కోసం టీచర్ల సిద్ధత పెంచడం, అధ్యయనం అనే పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రస్తుతం కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ఆయన అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎం యాదగిరి హర్షం వ్యక్తం చేశారు.

## రైల్వే ప్లాట్‌ఫామ్‌పై తమిళనాడు వాసి మృతి

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా గంగవెల్లి కడంపూర్ గ్రామానికి చెందిన రామచంద్రన్ దురైస్వామి(51) అనారోగ్యంతో ప్లాట్‌ఫాంపైనున్న సిమెంటు బెంచీపై మృతి చెందినట్లు వరంగల్ రైల్వే ఎస్ఐ ఎం.వై.మోహినుద్దీన్ తెలిపారు. అనారోగ్యంతోనే ఆయన మృతి చెందినట్లు తెలుస్తోందని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుని వద్ద లభించిన ఆధార్‌కార్డుతో ఆయన బంధువులకు సమాచారం అందించామని తెలిపారు.

## గార్ల తహసీల్దార్ సస్పెన్షన్



తహసీల్దార్ రవీందర్

గార్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం వహించిన మహబూబా బాద్ జిల్లా గార్ల మండల తహసీల్దార్ కె.రవీం దర్‌పై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం రాత్రి సస్పెన్షన్ వేటు వేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన తహసీల్దార్ల సమావేశానికి ఆయన హాజరు కాకపోవడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. కాగా, గార్ల మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డోర్నకల్ మండల తహసీల్దార్ కృష్ణవేణికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

## ఎక్సైజ్ వాహనాల వేలం

రూ.22 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తొర్రూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం అధికారులు వేలం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై రవళి తెలిపిన వివరాల ప్రకారం 57 వాహనాలకు వేలం నిర్వహించగా రూ.22లక్షల 47వేల ఆదాయం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం వేలం నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కాదు.. సర్కారు బడే

### హెచ్‌ఎం కృషితో కల్వల పాఠశాలకు కొత్తరూపు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఏదో పట్టణంలోని కార్పొరేట్ స్కూల్ అనుకుంటే పొరపాటే. ఇది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళ్లెం వీరారెడ్డి తన సొంత డబ్బు రూ.35 వేలు వెచ్చించి పాఠశాలకు రంగులు, పేరుబోర్డు రాయించారు. 85 మంది విద్యార్థులున్న ఈ ప్రాథమిక పాఠశాలలో మరింత మంది చేరేందుకు కృషి చేస్తూ సొంత ఖర్చులతో ఆకర్షణీయంగా చేసిన హెచ్‌ఎంను తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి




రంగులతో మెరిసిపోతున్న కల్వల ప్రాథమిక పాఠశాల



అమ్మో..రికా

# మనోళ్లలో.. డిపోర్టేషన్ భయం!

**ట్రంప్ ఆంక్షలతో అగ్రరాజ్యంలోని ఓరుగల్లు విద్యార్థుల్లో ఆందోళన**

- చదువుతూ.. పార్ట్‌టైమ్ చేసే వారికి గండమేనని ప్రచారం
- నింబధనల ప్రకారం క్యాంపస్‌లో వారంలో 20గంటలే జాబ్ చేసుకునే అవకాశం
- పార్ట్‌టైం జాబ్స్ చేయకుండా అమెరికాలో ఉండటం కష్టమంటున్న విద్యార్థులు
- ఉమ్మడిజిల్లా నుంచి చదువుల కోసం అమెరికాకు ఐదారు వేల మందికి పైగా పయనం
- తగిన పత్రాలు లేకుండా.. అక్రమంగా ఉంటున్నవారిలో గుబులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అమెరికా.. యువతకు కలల శ్వేతసౌధం. ఆ దేశంలో ఉన్నత చదువులు పూర్తిచేసి.. అక్కడే స్థిరపడితే.. 'డాలర్ డ్రీమ్స్ నెరవేరుతాయని, తమకు బంగారు భవిష్యత్ ఉంటుందని చాలామంది భావిస్తారు. ఈ క్రమంలోనే ఎంతో మంది అమెరికా బాట పడుతున్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమ్యాటిక్స్‌తో పాటు మెడిసిన్ లాంటి కోర్సుల్లో డిగ్రీలు, పీజీల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు ఆరువేల మందికి పైగా విద్యార్థులు అగ్రరాజ్యం వెళ్లినట్టు అంచనా. వారిలో అధికశాతం మంది చదువుకుంటూనే పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. అలాంటి వారికి ఇప్పుడు డిపోర్టేషన్ ( స్వదేశానికి పంపడం) భయం పట్టుకుంది. అమెరికాకు వెళ్లే విద్యార్థుల్లో చాలా మంది ఎఫ్-1 వీసాపైనే ఉన్నారు. ఈ వీసాపై వెళ్లినవారు వారానికి 20గంటలు మాత్రమే పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చు. అదికూడా వారి క్యాంపస్‌లోనే. ఈ నిబంధనలను అతిక్రమిస్తే అమెరికా దౌత్య విధానం ప్రకారం వారిని ఆ దేశం నుంచి బయటకు పంపించేయవచ్చు. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇమ్మిగ్రేషన్‌పై కొరఢా ఝుళిపిస్తుండటం.. సరైన పత్రాల్లేకుండా అక్రమంగా తమ దేశంలో ఉంటున్న వారిని కూడా గుర్తించి వారివారి దేశాలకు పంపిస్తుండటం లాంటి చర్యలతో మన విద్యార్థులు దిగులు చెందుతున్నారు.

## అమెరికా వైపే ఓరుగల్లు యువత..

ఉన్నత చదువుల కోసం యువత అమెరికా బాట పడుతున్నారు. చదువుతూనే పార్ట్‌టైమ్ జాబ్ చేసుకోవచ్చనే ఆలోచనతో పాటు అమెరికాలో స్థిరపడితే భవిష్యత్‌కు తిరుగుండదన్న ఆశతో చాలా మంది ఉన్నత చదువుల కోసం అమెరికాకు పయనమవుతున్నారు. కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా తదితర దేశాలతో పోలిస్తే అమెరికా వీసా కోసం క్యూ కట్టే యువతే ఎక్కువగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు ఆరువేల మందికి పైగా విద్యార్థులు చదువుల కోసం అమెరికా వెళ్లినట్టు అంచనా కాగా.. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వారే అధికంగా ఉన్నారు. వీరితో పాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, ములుగు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసమని అగ్రరాజ్యం బాట పడుతున్నారు. అమెరికాకు వెళుతున్నవారిలో ఎక్కువ శాతం ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం వెళ్లినవారే ఉన్నారు. ఇన్నాళ్లు సాఫీగా సాగినప్పటికి ట్రంప్ రెండోసారి అమెరికా దేశానికి అధ్యక్షుడైన తరువాత ఇమ్మిగ్రేషన్‌పై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. విదేశీ విద్యార్థుల వీసా నిబంధనలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో అమెరికాలో చదువు కోసం వెళ్లిన విద్యార్థుల్లో ఆందోళన కనిపిస్తోంది.

## ట్రంప్ ఆంక్షలు.. విద్యార్థుల్లో డిపోర్టేషన్ భయం

అమెరికాకు వెళ్లే విద్యార్థుల్లో చాలామంది ఎఫ్-1 వీసాపైనే ఉన్నారు. ఈ వీసాపై వెళ్లినవారు వారానికి 20గంటలు మాత్రమే పార్ట్‌టైమ్ చేసుకోవచ్చు. అదికూడా వారి క్యాంపస్‌లోనే పార్ట్‌టైమ్ జాబ్స్ చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనను అతిక్రమిస్తే అమెరికా దౌత్య విధానం ప్రకారం వారిని దేశం నుంచి బయటకు పంపించేయవచ్చు. గతంలో ఈ నిబంధన ఉన్నప్పటికి పెద్దగా ఎవరు పట్టించుకోలేదు. అయితే ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ ఇమ్మిగ్రేషన్‌పై కొరఢా ఝులిపిస్తున్నారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్న.. పత్రాలు సరిగ్గా లేకున్నా ఇక్కడే ఉంటున్న వారిని కూడా గుర్తించి వారి స్వదేశాలకు పంపిస్తున్నారు. అమెరికాలో ట్రంప్ వలసవాదులను ఏరివేసేందుకు ప్రత్యేకంగా బలగాలను రంగంలోకి దింపారు. మెక్సికో వలసవాదులే ట్రంప్ లక్ష్యమైనప్పటికి నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ప్రతి ఒక్కరిపై అక్కడి అధికారులు ఫోకస్ చేస్తున్నారని అమెరికాలో చదువుతున్న మన విద్యార్థులు వాపోతున్నారు. 'పోలీసుల తనిఖీలు పెరిగాయి. దొరికితే మీ లైఫ్ స్పాయిల్ అవుతుంది. మా సంస్థకు 50వేల డాలర్ల వరకు జరిమానా విధిస్తారు. మా వ్యాపార లైసెన్స్‌లు రద్దు చేస్తారు. మీకు ఇలా చెప్పటం బాధగానే ఉంది, కానీ పరిస్థితులు కుదుట పడేవరకు పనిలోకి రావద్దు' అంటూ ఆయా కంపెనీల మేనేజర్లు ఫోన్లు చేసి విద్యార్థులకు చెప్పేస్తున్నారట. దీంతో ఏం చేయాలో తోచక చాలా మంది విద్యార్థులు ఇంటికే పరిమితం అవుతున్నారు. కాగా, ట్రంప్ ఆంక్షల మధ్య అమెరికాలో వరంగల్ విద్యార్థులకు ఆర్థిక కష్టాలు మొదలయ్యాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా డాలర్ డ్రీమ్‌తో అమెరికాలో అడుగు పెట్టిన పేద, మధ్యతరగతి పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు దిగులు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్‌కు ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పడంతో పాటు స్నేహహస్తం చాటిన క్రమంలో ట్రంప్ తన నిర్ణయాల్లో మన దేశ విద్యార్థులకు సడలింపునిస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

### పార్ట్‌టైమ్ జాబ్స్‌తోనే చదువు..

అమెరికా వీసా లభిస్తే చాలు.. ఎలాగోలా జీవితంలో స్థిర పడిపోవచ్చనే ధీమా విద్యార్థుల్లో ఉంది. తల్లిదండ్రులు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారు. పిల్లలను అమెరికాకు పంపిస్తే చాలు.. అక్కడ ఏదో ఒక పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుని తన కాళ్ల మీద తాను నిలబడుతాడనే ఆశతో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ నుంచి వెళుతున్న విద్యార్థుల్లో చాలామంది ఉదయం తరగతులు కాగానే, సాయంత్రం పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటున్నారు. అందరికి వారివారి క్యాంపస్‌లో ఉద్యోగాలు లభించవు కాబట్టి అక్కడి విద్యార్థులు పెట్రోల్ బంకులు, రిటైల్ స్టోర్స్, రెస్టారెంట్లు, గ్రోసరి స్టోర్స్, లిక్కర్ మార్ట్, హోటల్స్, షాపింగ్ మాల్స్ తదితర వాటిల్లో అనధికారికంగా పని చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గంటకు సుమారు ఏడెనిమిది డాలర్ల వరకు పార్ట్‌టైమ్ వేతనం లభిస్తుంది. అంటే సుమారు గంటకు రూ.750వరకు సంపాదన ఉంటుందని ఓ విద్యార్థి తెలిపారు. ఇలా రోజుకు ఆరు గంటల వరకు జాబ్ చేస్తు రోజుకు సుమారు రూ.5వేల వరకు ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన డబ్బులతోనే చాలమంది విద్యార్థులు వారి చదువులు, ఇతర ఖర్చులకు వాడుకుంటున్నారు. చదువుతో పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకునే అవకాశం ఉండటంతోనే చాలమంది అమెరికా చదువుపై క్రేజీ పెంచుకుంటున్నారని ఓ ఎన్ఆర్ఐ అభిప్రాయపడ్డారు.





నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

# సూపర్ స్పెషాలిటీ అస్పత్రిపై కదలిక

**31న అస్పత్రి నిర్మాణం, వైద్య సేవలపై అధికారులతో సీఎం సమీక్ష**


**కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎంను కలిసిన ఓరుగల్లు ఎమ్మెల్యేలు**

**మడికొండ డంపింగ్ యార్డు గురించీ వివరించిన ప్రజాప్రతినిధులు**

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎం అస్పత్రిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 24 అంతస్తుల్లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసేందుకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష ఏర్పాటు చేశారు. 'అడ్డంకులు తొలిగేదెన్నడో' అనే శీర్షికన ఈ నెల 18వ తేదీన సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనుల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అలాగే గతంలో కూడా సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసి పేదలకు వైద్యసేవలు అందించేందుకు చొరవ చూపాలని పలుమార్లు కథనాలను ప్రచురించిన విషయంతెలిసిందే. దీంతో మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి, వర్ధన్నపేట, డోర్నకల్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, యశస్వినిరెడ్డి, నాగరాజు, రామచంద్రునాయక్ తదితరులు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎంజీఎం పరిస్థితిని వివరించటంతో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 31వ తేదీన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సూపర్ స్పెషాలిటీ అస్పత్రిపై సమీక్ష ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రాంపూర్ యార్డు దుస్థితి, ఏడు గ్రామాల ప్రజల అవస్థలపై కడియం శ్రీహరి, ఇతర ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డు పొగ వల్ల గాలి, తాగునీరు కలుషితమవుతోందని, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు శ్వాసకోశ సమస్యలకు గురవుతున్నారని వివరించారు. వెంటనే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు వరంగల్ నగరంలో చేపట్టబోయే భూగర్భ డ్రైయినేజీ కి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయటంతో పాటు త్వరగా పనులు చేపట్టాలని, వరంగల్ ఔటర్ రింగు రోడ్డుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.

ఎమ్మెల్యేల విజ్ఞప్తికి స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్‌ఘనపూర్‌ను మునిసిపాలిటీగా మార్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఈ బృందంలో లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.



చరిత్ర

శిలాశాసనం ఉన్న ఉర్సుగుట్ట

# శిథిలమవుతున్న శిలాకావ్యం

- రక్షణకు నోచుకోని ఉర్సుగుట్టపై ఉన్న 'సిద్ధోద్వహం'
- శిలపై ప్రేమకావ్యం రచించిన నృసింహ కవి
- దెబ్బతింటున్న పురాతన సంపద
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర శివార్లలోని చారిత్రక ఉర్సుగుట్టపై ఉన్న శిలాకావ్యం సరైన రక్షణ లేక దెబ్బతింటోంది. ఈ శిలపై చెక్కిన ఈ ప్రబంధానికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇలాంటి కావ్య శాసనం భారత దేశంలోనే మరెక్కడా కనిపించదు. దీనినే ఉర్సు గుట్టశాసనంగా పిలుస్తారు. వరంగల్‌లోని చారిత్రక విశేషాల్లో, శిల్ప సంపదలో ఇదొక్కటి. సిద్ధోద్వహం పేరుతో ప్రసిద్ధి చెందిన ఈ శిలా కావ్యాన్ని కాకతీయుల కాలం నాటి గొప్ప సంస్కృత కవి విశ్వేశ్వర పండితుని పుత్రుడు నృసింహకవి దీనిని లిఖించనట్టుగా చెబుతారు. ఇదొక ప్రేమ కావ్యం. ఒక రోజు సిద్ధుడు తన ప్రియురాలు పక్కపై లేనిది చూసి విరహవేదనతో వెతుకుతూ పోతాడు. సిద్ధునకు తన ప్రియురాలి ప్రథమ సమాగమం ఆమె చెలులతో నాట్య కలాపంలో ఉండగా.. తండ్రి పిలుపు రావడంతో ఆమె అంతఃపురానికి వెళుతుంది. ఇది తెలుసుకొని సిద్ధుడు తన విరహాన్ని చెప్పి వర్తమానం పంపుతాడు. దాంతో మరుసటి రోజు రాత్రి తన భవనంలోకి ఎవరి కంటపడకుండా రావలసిందిగా కిన్నెర బదులిస్తుంది. సిద్ధుడు భవనంపైకి ఎక్కుతుండగా పట్టుబడి జైలుకు వెళతాడు. కొన్ని రోజుల తర్వాత కిన్నెర తండ్రి అతనిని యక్షునిగా తెలుసుకొని తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తాడు. ఇది సంక్షిప్తంగా వీరి ప్రేమ కథ. ఈ కావ్యంలో సూర్యాస్తమయం, విరహం వర్ణణలు, వివాహానంతరం సంభోగ శృంతార వర్ణణలు రసోత్తరంగా ఉంటాయి. ఈ శాసన కావ్యం చివర విశ్వేర పండితిని పుత్రుడు నరసింహర్షి కవి విరచింతగా పేర్కొనబడి ఉంది. ఇందులో 60 శార్దూల విక్రీడిత వృత్తాలు, 2 స్రగర్ధలు మొత్తం 62 శ్లోకాలున్నాయి.

ఈ కావ్యానికి కవి పేరు సూచించలేదు. అయినా దీనిలోని కథా సందర్భాలను బట్టి ఈ శిలా ప్రబంధం సిద్ధోద్వాహం పేరుతో ప్రముఖ శాసన పరిష్కర్త డాక్టర్ పీవీ పరబ్రహ్మశాస్త్రి పరిష్కరించారు. ఈ శిలాకావ్యాన్ని 1968లో రాష్ట్ర పురావస్తు శాఖ సిద్ధోద్వాహం పేరుతో ప్రచురించింది. ప్రచురణతోనే పురావస్తుశాఖ సరిపెట్టుకుంది కానీ ఈ శిలాకావ్యాన్ని పరిరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర పురావస్తుశాఖ సైతం విస్మరించింది. దీనితో ఈ కావ్య శాసనం క్రమంగా శిదిళావస్థకు చేరుకుంటున్నది. విచ్చలవిడి క్వారీ వల్ల ఉర్సు గుట్ట ఇప్పటికే సగానికిపైగా తరిగి పోయింది. దీనిపై ఉన్న ఈ వారసత్వ సంపద క్రమంగా దెబ్బతింటోంది. ఇప్పటికైనా ఈ అపురూప కావ్యశాసనాన్ని కాపాడాలని నగర వాసులు, చరిత్రకారులు కోరుతున్నారు.

### ఎవరీ నృసింహ కవి..



నృసింహకవి చెక్కిన శిలా కావ్యం

నృసింహకవి కాకతీయుల కాలంలో గొప్ప సంస్కృత పడింతుడు. ఆయన సిద్ధోద్వాహంతో పాటు కాదంబరి కళ్యాణం అనే నాటకాన్ని కూడా రాశారు. కాదంబరి కావ్య కథను ఎనిమిది అంకాలుగా తీర్చిదిద్దాడు. ఇందులో మహాస్వేత పుండరీకుల ప్రేమకథ అంతర్నాటకంగా చెప్పడం విశేషంగా కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో అనేక మంది సంస్కృత కవులు ఉన్నారు. సాధారణంగా కావ్య రచన ఆనాడు అందుబాటులో ఉండే తాళపత్రాలుపై రాసేవారు. కాకతీయుల కాలంలో రాళ్ళపై శాసనలు చెక్కడం విస్తృతంగా కనిపిస్తుంది. ఇదే క్రమంలో కవులు సైతం తమ రచనలను రాయడానికి శిలలనే ఎన్నుకున్నారనడానికి ఈ సిద్ధద్వాహమే ప్రత్యక్ష ఉదాహరణ.

### ఎండాకాలం రాక ముందే ఎడారి

మానేరు ఎండిపోయింది. ఎండాకాలం రాకముందే ఎడారిగా మారింది. మల్హర్ మండలం తాడిచర్లలోని మానేరు ప్రతీ వర్షాకాలంలో నీటితో కళకళలాడుతుంది. ఫిబ్రవరి వరకూ నీటి ప్రవాహం కనిపిస్తూ ఉంటుంది. అలాంటి మానేరు రెండేళ్లుగా జనవరి ఆరంభం నుంచే బోసిపోతోంది. ఎగువ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు కావడం, చెక్‌డ్యామ్‌ను నిర్మించడంతో దిగువకు నీరు రాక ఈ పరిస్థితి ఉంటోంది. ఇక ఈసారి కూడా ఎండాకాలం రాకముందే చుక్కనీరు లేకుండా ఎడారిగా మారింది. మరోవైపు నీటి ప్రవాహం లేక పరివాహక రైతులు పంటలకు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. - మల్హర్, ఆంధ్రజ్యోతి



తాడిచర్ల వద్ద ఎడారిని తలపిస్తున్న మానేరు

# అల్లం మురబ్బా.. రబ్బా..

- కాసింత తీపి.. కాసింత కారం
- నోరూరిస్తున్న పాత కాలం తీపి చిక్కి
- 40ఏళ్లుగా విక్రయిస్తున్న చిరువ్యాపారులు



మాదాసి ప్రకాశ్

జూలైవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అల్లం మురబ్బా... అల్లం మురబ్బా.. ఉదయం పార్కుల్లో, రద్దీగా ఉండే నాలుగు కూడళ్లలో.. అప్పుడప్పుడు... వీధుల్లో.. ఈ పదం వినిపిస్తుంది. చిరువ్యాపారి స్టీల్ ప్లేట్‌లో అందంగా పేర్చుకొని అమ్ముతుండడం మనకు తరుచూ కనిపించే దృశ్యం. ఇదొక పాతకాలపు చిక్కి. ఔషధ గుణాలున్న దీనిని తింటే ఆరోగ్యానికి మంచిదని ఇప్పటికీ చాలా మంది కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు ఎక్కువగా కొంటుంటారు. అల్లం మురబ్బా అమ్మకం వృత్తిగా జీవిస్తున్నవారు ఇప్పటికీ నగరంలో ఉన్నారు.

## 40 ఏళ్లుగా అమ్మకం

40 సంవత్సరాలుగా అల్లం రబ్బాను అమ్ముతున్నవారు అక్కడక్కడ కనిపిస్తారు. అలాంటి వారిలో ఒకరు మాదాసి ప్రకాశ్. ఆయన వయస్సు 64 సంవత్సరాలు. వరంగల్ కాశీబుగ్గలో నివాసం ఉండే ప్రకాశ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. ముగ్గురికీ పెళ్లిళ్లయ్యాయి. గత 40 ఏళ్లుగా అల్లం మురబ్బాను అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన రోజు ఉదయం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో అల్లం మురబ్బాతో దర్శనమిస్తారు. అల్లం మురబ్బా.. రబ్బా అంటూ తిరుగుతూ వాకింగ్ చేసే వారికి అమ్ముతుంటారు. ఇక్కడే కాదు ..వరంగల్, హనుమకొండ బస్టాండ్లు, కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్లు, పార్కులు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో కాలినడకన తిరుగుతూ విక్రయిస్తుంటాడు. ప్రకాశ్ ఒక్కడే కాదు చాలా మంది అల్లం రబ్బా అమ్ముతూ పొట్టపోసుకోవడం కనిపిస్తుంది. అయితే రోజు తాను 70 వరకు అల్లం మురబ్బాను విక్రయిస్తానని ప్రకాశ్ చెబుతున్నారు. చెక్కరతో తయారు చేసిన అల్లం మురబ్బాను రూ.10, బెల్లంతో తయారు చేసిన అల్లం మురబ్బాను రూ. 20కి అమ్ముతానని, రోజంతా ఎండనకా, వాననకా కాళ్లరిగేలా తిరిగి అమ్మితే దీని వల్ల సుమారు రూ. 1000 వరకు వస్తాయని చెబుతున్నారు. తయారీ ఖర్చు పోను నికరంగా రూ.400 నుంచి రూ.500 వరకు మిగులుతుందని, తాను ఈ అల్లం రబ్బాను రూ.1ధర ఉన్నప్పటి నుంచి అమ్ముతున్నానని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం మారిన కాలంతో గతంలో ఎక్కువ మంది అల్లం రబ్బా అంటే ఇష్టపడేవారు తగ్గారని ఆయన చెబుతున్నారు.

## అల్లం మురబ్బా అంటే.. ప్రయోజనాలేంటంటే..

అల్లం ముక్కలను చెక్కెరలో లేదా బెల్లంలో ఉడికించి తయారు చేసిన ఇంటి చిక్కి. దీనిలో అల్లం కలపడం వల్ల కొంచెం తీపిగా.. కొంచెం కారంగా ఉంటుంది. అల్లం ముక్కలను చిన్నచిన్న ముక్కలుగా కోసి నీటిలో ఉడికిస్తారు. అందులో కొంత శొంఠి, మిరియాలను కూడా కలుపుతారు. ఆ తర్వాత వాటిని చెక్కెర లేదా బెల్లంతో కలిపి మళ్లీ ఉడికిస్తారు. నీరు ఆవిరి అయి పాకం చిక్కబడిన తర్వాత ఒక ప్లేట్‌లో పోసి చల్లారుస్తారు. ముక్కలుగా కోసి నిల్వ చేస్తారు. ఈ అల్లం మురబ్బా తినడం వల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉండే అల్లం వల్ల జలుబు, దగ్గు లాంటి సమస్యలను తగ్గుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఆహారం జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడుతుంది. రోజుకు ఒకటి రెండు ముక్కలు అల్లం రబ్బాను తీసుకోవచ్చు. నేరుగా తినవచ్చు. లేదా టీలో కలిపి తాగవచ్చు. అయితే అల్లం మురబ్బాను అధికంగా తీసుకోవడం కూడా మంచిది కాదని చెబుతున్నారు.



# సూర్యాస్తమయం.. సుందర దృశ్యం..

సూర్యాస్తమయ సమయాన.. అరువర్ణధారియైన ఆ సూరీడు ధగ ధగ మెరుస్తూ కొండల చాటు నుంచి అదృశ్య మవుతున్న వేళ.. వేటకు వెళ్లిన పక్షులు గూళ్లకు చేరుతున్న సుందర దృశ్యమిదీ. మంగళవారం హనుమకొండ అమ్మవారిపేట చెరువు వద్ద కనపించిన ఈ ప్రకృతి రమణీయ దృశ్యం పర్యావరణ ప్రేమికులను కట్టిపడేసింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, హనుమకొండ

# గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

• అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం గ్రంథాలయ పాఠకులకు ఉపయోగకరంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో అన్నారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలు,మునిసిపాలిటీలు ఎప్పటికప్పుడు గ్రంథాలయ పన్నును చెల్లించాలని సూచించారు. ప్రతీ గ్రంథాలయంలో పాఠకులకు పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన నిధుల వివరాలు, 2025-26 సంవత్సరంలో బడ్జెట్ అంచనాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, డీఈవో రవీందర్ రెడ్డి, డీపీఆర్వో వల్లోజు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్, అధికారులు

● మహబూబాబాద్ మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోను స్థానిక మునిసిపల్ అధికారులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అదనపు కలెక్టర్‌కు మొక్కను బహూకరించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, డీపీవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

### మరిపెడ జ్యోతిబా పూలే గురుకులం పాఠశాల తనిఖీ

మరిపెడ, (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మెనూ విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. ఆయన మరిపెడలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, స్టాక్ రూం చెక్‌చేశారు. విద్యార్థులకు జరుగుతున్న బోధనను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలుపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

దంతాలపల్లి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వత్సల్ టోప్పో అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల రిజిష్టరు, విద్యార్థుల హాజరు పట్టిక, మార్కుల రిజిష్టర్లను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలో విద్యార్థులు ప్రతిభ కనబర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, ప్రిన్సిపాల్ శ్రీనువాస్, తహసీల్దార్ రాజేశ్వర్‌రావు ఉన్నారు.

## పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

• టీఎస్ సీపీఎస్‌ఐయూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన యూపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఐయూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం కంబాల పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెనుశాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు పోరాటం చేస్తుంటే కేంద్రప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీసుకువచ్చి మరో మోసానికి తెరలేపిందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయ బృందం రాధిక, కవిత, సువర్ణ, శ్రీజ పాల్గొన్నారు.

## 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు'కు మద్దతు

నెహ్రూసెంటర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత హక్కుల నేత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపడుతున్న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు'కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య తెలిపారు. మహబూబాబాద్‌లోని కేటీఆర్, జగ్జీవన్‌రాం కాలనీల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాడుతున్న దళిత ఉద్యమ నాయకుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు కార్యక్రమానికి దళితులు, దళిత ఉపకులాలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య

ఈ కార్యక్రమంలో పులిశ్రీను, సీహెచ్.రాధ, కుక్కల సుధ, కందిపాటి బిక్షపతి, ఎల్లయ్య, ఉపేందర్, వీరభద్రం, సందీప్, బాలరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న రాజమౌళి

### సినీ హాస్యనటుడు రాజమౌళికి డాక్టరేట్ ప్రదానం

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జంగిలిగొండ గ్రామానికి చెందిన సినీ హాస్యనటుడు గడ్డం రాజమౌళి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్శిటీ రాజమౌళికి గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ జోసఫ్ పలంగి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాముల్ చేతుల మీదుగా రాజమౌళి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. జంగిలిగొండకు చెందిన నిరుపేద గడ్డం తిరుపతి -రాజమ్మ దంపతుల కుమారుడు రాజమౌళి జంగిలిగొండలో 5వ తరగతి వరకు, వీఎస్.లక్ష్మీపురంలో 6 వ తరగతి, మహబూబాబాద్‌లో 7 నుంచి డిగ్రీ వరకు, భువనగిరిలో బీఈడీ విద్యనభ్యసించారు. చిన్నతనం నుంచి కళారంగంపై మక్కువ ఉండడంతో క్రమశిక్షణ, పట్టుదలతో సినీ హాస్యనటుడిగా ఎదిగి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలను పొందాడు. రాజమౌళి డాక్టరేట్ అందుకోవడం పట్ల జిల్లా వాసులు, కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తొర్రూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 4పథకాలు అమలు చేసిన నేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో తొర్రూరులోని గాంధీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు సుంచు సంతోష్, సోమరాజశేఖర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తుందని, ప్రతిపక్షాల మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు నల్లపు రాజు, భిక్షం, జలీల్, చిదిరాల రవి, మధు, అనిత, శ్రీనివాస్, వెంకన్న, గుండాల నర్సయ్య, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవంగర, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బరాబర్ చేసి తీరుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్‌కార్డుల మంజూరుతోపాటు పలు హామీలను అమలు చేస్తున్న సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకంనిర్వహించారు. నాయకులు గోపాల్‌నాయక్, మూత్యాల పూర్ణచందర్, సీతారామ్‌నాయక్, తోటకూరి శ్రీనివాస్, శ్యామ్, వెంకన్న, శ్రీనివాస్, వేణు, సతీష్, రమేష్ పాల్గొన్నారు.



తొర్రూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గార్ల, ఆంధ్రజ్యోతి) : నాలుగు గ్యారంటీ పథకాలను ఒకేసారి అమలు చేసిన రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో కార్యకర్తలు పాలభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, లింగాల నాగేశ్వరరావు, మన్నేపల్లి వెంకయ్య మండా రాము గౌడ్, గుగులోత్ శ్రీనివాస్‌నాయక్, హాతిరాంనాయక్, అందనాల రాజీవ్ నాయుడు పాల్గొన్నారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మహనీయులు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర్ సురేష్‌నాయక్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా విశిష్ట సేవలందించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, తన ఆటపాట ద్వారా ప్రజలను చైతన్య పరిచిన ఉద్యమ దీపిక గద్దర్ అని చెప్పారు. అలాంటి మహనీయులపై కేంద్రమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా యువతకు 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. మాజీ వార్డు కౌన్సిలర్ పోతురాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు రాంపెల్లి నవీన్, శాగంటి సందీప్, జీలుగుల భాస్కర్, శ్రవణ్, రాజేష్, శ్యామ్‌కుమార్, చరణ్, కార్తీక్, లింగస్వామి, దుర్గేష్, రాము పాల్గొన్నారు.

## రూ.5ల భోజన నాణ్యతను పరిశీలించిన చైర్మన్

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులో రైతుల కోసం రూ.5లకే భోజనం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుండగా... దాని నాణ్యతను మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ మంగళవారం పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డుకు వచ్చే రైతులు అర్ధాకలితో అలమటించకుండా రూ.5ల భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, మంగళవారం సాయంత్రం మార్కెట్ పాలకమండలి సమావేశం జరిగింది. పలు అంశాలపై సభ్యులు కీలకంగా చర్చించారు.

### ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలను చెల్లించాలి

డోర్నకల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గత మూడునెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి పరిష్కారం చూపడంలేదని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పార్థసారథి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది ఉపాధిహామీ పథకంలో ఉద్యోగాలు చేస్తున్నారని, సకాలంలో వేతనాలు రాకపోడంతో కుటుంబాలు పోషించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు అడుగగా సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు ఉన్నాయని, అందువల్లనే ఆలస్యం అవుతుందని చెబుతున్నట్లు ఆయన తెలిపారు.

### 'కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వక్ఫ్ ఆస్తుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని ముస్లీం జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌ఖాన్ అన్నారు. మహబూబాబాద్‌లో మంగళవారం ముస్లీం జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల సంరక్షణ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఈ నెల 27న ఏకపక్షంగా బిల్లు పెట్టడానికి చేసిన తీర్మాణం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ముస్లీంలను అణిచివేయాలని, వాళ్ల ఆస్తులను ధ్వంసం చేయాలనే ఉద్దేశ్యంతో బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతుందని విమర్శించారు. ముస్లీంల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలనే కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్డీ. ఫజల్, సయ్యద్ అజీజ్, నవీద్‌ఖాన్, జుబేర్‌ఖాన్, పిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

### వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

తొర్రూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి తూనికల కొలతల అధికారి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఫైవుడ్, ఫర్టిలైజర్స్, బేకరీలు, కిరాణా, గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు చేస్తున్న 10 వ్యాపార సంస్థలకు రూ. 35వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. గ్యాస్ ఏజెన్సీలో నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడవద్దని ఆదేశించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇష్టానుసారంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయన్నారు.వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈతనిఖీల్లో జిల్లా వినియోగదారుల ఫోరం ఇన్‌చార్జి వింజమూరి సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

### రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం రాష్ట్ర కౌన్సిల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయడంలేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్సుమెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్లను నియమించాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, సిబ్బంది నియామకాలు చేపట్టాలన్నారు. భద్రాచలంలో నిర్వహించనున్న రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గౌతం, నందీశ్వర్, సుహిత, తరుణ్, శ్యామ్, ప్రవీణ్‌కుమార్, రవీందర్, సాయి, విష్ణు, వివేక్, శివ పాల్గొన్నారు.

### కార్లాయిలో చద్దర్లు పంపిణీ చేసిన సీఐ

కొత్తగూడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సూచనతో మండలంలోని కార్లాయిలో సీఐ సూర్యప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పేద వృద్ధులకు చద్దర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై కుశకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, జిల్లా నాయకుడు లావణ్య వెంకన్న, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ కేదాసు ప్రసాద్, నాయకుడు నోముల ప్రశాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

### యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంఓపీఎస్ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న విడుదల చేసిన ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్) విధానాన్ని రద్దు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయు రాష్ట్ర కార్యదర్శి ఎస్కె. మొబిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సదరు ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగు రమేష్, పోలెపల్లి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, స్వరూపరాణి, అహ్మద్‌ఖాన్, పూస శ్రీనివాస్, కల్యాణ్, ఎంజె.రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్, వీరలక్ష్మీ, రుచిత, రమేష్, రాజు పాల్గొన్నారు.

### గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తొర్రూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు చక్రాల రఘు అన్నారు. మంగళవారం తొర్రూరు కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నిరసన వ్యక్తం చేసి వారు మాట్లాడారు. గద్దర్‌ను తెలంగాణ సమాజమేకాక దేశ ప్రజల గుండెల్లో నిలిచి చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. వెంటనే బండి సంజయ్ క్షమాపణ చెప్పి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సాంస్కృతిక కళాశగద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

### విద్యార్థినులకు ఆత్మీయ వీడ్కోలు

ఇనుగుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం పదో తరగతి, ఇంటర్ ద్వితీయసంవత్సర విద్యార్థినీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ప్రిన్సిపాల్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం, మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, ఎంఈవో రూపారాణి, డీటీ రవి, హెచ్‌ఎం వీరన్న పాల్గొన్నారు.

### మద్రాసు కవి సమ్మేళనానికి హాజరైన మరిపెడ వాసి

మరిపెడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుశాఖ మద్రాసు విశ్వవిద్యాలయం సోమవారం, మంగళవారం చెన్నైలో నిర్వహించిన కవి సమ్మేళనానికి మరిపెడ వాసి పెద్యోజు నరేశ్ హాజరై ఉమర్ అలీసా సాహిత్యంపై మంగళవారం తన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేశ్‌ను నిర్వాహకులు అభినందించారు. ఈ సదస్సులో ఆచార్య విస్తాలి శంకర్‌రావు, పిఠాపురం తొమ్మిదోవ పీఠాధిపతి ఉమర్‌అలీషా, సినీగేయ రచయిత భువన చంద్ర, వ్యాసిలి వసంత్, లింగమనేని శంకర్, గుడిమెట్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### చెడుమార్గాలకు దూరంగా ఉండాలి

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోనే చెడుమార్గాలకు దూరంగా ఉంటూ ప్రణాళిబద్ధంగా క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ ఆదేశాలతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పదో తరగతి అనంతరం విద్యార్థులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎస్ఐ జి.మురళీధర్‌రాజ్, ప్రొహిబిషనరీ అధికారి కోటేశ్వర్‌రావు, హెచ్‌ఎం బందెల రాజు, గంగుల శ్రీనివాస్, పీడీ కొమ్ము రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానుకోటలో పాత, కొత్త బజారులకు వెళ్లేందుకు ఉన్న ఏకైక రైల్వేగేట్

## రాకపోకలకు కష్టాలే.!

(5వ పేజీ తరువాయి)

అక్కడ భారీగా వాహనాలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో సుదూర ప్రాంతంలో ఉన్న ఆర్వోబీ గుండా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

రైల్వే అండర్‌పాస్‌లను వినియోగంలోకి తీసుకువస్తే...

మహబూబాబాద్ పట్టణంలో నిరుపయోగంలో ఉన్న రెండు రైల్వే అండర్ పాస్‌లను వినియోగంలోకి తీసుకువస్తే ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. సిగ్నల్ కాలనీసమీపంలో ఉన్న రైల్వే అండర్‌పాస్‌ను వినియోగంలోకి తీసుకువస్తే అటు మునిసిపల్ పరిధిలోని శనిగపురం, ఈదులపూసపల్లి, ఆయా ప్రాంత కాలనీవాసుల వాహనదారులు పాత, కొత్త బజారులకు రాకపోకలు కొనసాగించే అవకాశం ఉంటుంది. మరోపక్క వ్యవసాయ మార్కెట్ సమీపంలోని అనంతారం రోడ్‌లోఉన్న రైల్వే అండర్‌పాస్ వద్ద మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తే అనంతారం, గాంధీపురం, బయ్యారం ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు పట్టణంలోకి ప్రవేశించకుండా పాత, కొత్త బజారులకు ఆ మార్గం గుండా వెళ్లె అవకాశం ఉంటుంది.

మానుకోట పట్టణానికి రెండు వైపుల ఉన్న రైల్వే అండర్ పాస్‌లను వినియోగంలోకి తీసుకురావడం వల్ల ఇప్పుడే కాకుండా మున్ముందు కూడా ద్విచక్ర వాహనదారులు పట్టణంలోకి ప్రవేశించకుండా ఆయా మార్గాల గుండా రాకపోకలు కొనసాగించనున్నారు. తద్వారా జిల్లా కేంద్రంలో వాహనాల తాకిడి తగ్గి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటుంది. ఆ దిశగా అధికారులు ఆలోచించి రైల్వే అండర్ పాస్‌లను వినియోగంలోకి తీసుకురావాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా మూడో రైల్వేలైన్ పనులు జరుగుతున్న తరుణంలో ఇప్పటికే ట్రాక్ పక్కన అంబేద్కర్ సెంటర్ సమీపం నుంచి రైల్వేగేట్ వరకు గతంలో ఉన్న రోడ్డు మార్గాన్ని అధికారులు మూసివేశారు. దీంతో పక్కనే ఉన్న మెటల్ రోడ్డుపై నుంచి వాహనదారులు ప్రయాణి స్తున్నారు. కాగా, సిగ్నల్‌కాలనీ ప్రాంతంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌ను సీపీఐ నాయకులు సందర్శించి దానిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ట్రాక్ వరకు ఉన్న మెటల్ రోడ్డుకు రూ. 50లక్షలు కేటాయించి, రోడ్డును నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### రైల్వే అండర్‌పాస్‌లను వినియోగంలోకి తేవాలి

బి.అజయ్‌సారథిరెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి



మహబూబాబాద్‌లో ప్రజలు, వాహనదారుల సౌకర్యార్థం సిగ్నల్ కాలనీ వద్ద, అనంతారం రోడ్‌లో ఉన్న రైల్వే అండర్ పాస్‌లను వినియో గంలోకి తీసుకురావాలి. జిల్లా కేంద్రంలో రైల్వే మూడవ లైన్ పనులు నడుస్తున్న క్రమంలో మూసి వేసిన రైల్వే అండర్‌పాస్‌లను వినియో గంలోకి తీసుకువస్తే ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తొలుగుతాయి. పాడి పశువులు రైల్వేగేట్ నుంచి వెళ్తుంటే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతుంది. అందుకోసం మూసి వేసిన రైల్వే అండర్‌పాస్‌ను పునరుద్ధరించాలి. గతంలో మంజూరైన ఆర్వోబీ నిర్మాణానికి కృషి చేయాలి.

## సంక్షిప్త వార్తలు

### గుండెపోటుతో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

కేసముద్రం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, ధన్నసరికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు గోపాల వెంకట్‌రెడ్డి (46) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఉదయం స్వల్పంగా అనారోగ్యానికి గురికాగా కారులో హైదరాబాద్ ఆస్పత్రికి వెళుతున్న క్రమంలో మార్గ మధ్యలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రాణి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి మృతిపట్ల ఎంపీ బలరాంనాయక్ సంతాపం వ్యక్తం చేశారు.

### 'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

సీరోలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నగేష్ అన్నారు. సీరోలు మండలం కొత్తూరు(సి)ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మార్చి నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెడు వ్యసనాలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. పోలీస్ సిబ్బంది వీరయ్య, రాము, సంజీవరావు రేణుక. ఉపాధ్యాయులు వీరన్న పాల్గొన్నారు.

### ఎన్డీ పెద్ద చంద్రన్న పార్టీలో చేరికలు

కొత్తగూడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్దన్న వర్గం పార్టీలో మంగళవారం చేరినట్టు ఎన్డీ పెద్దన్న వర్గం రాష్ట్ర కార్యదర్శి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్మీ గ్రామానికి చెందిన భూక్య శంకర్, గుడితండాకు చెందిన తీగల మహేందర్, తిమ్మాపురంకు చెందిన సుంకర బోయిన యాకయ్య పార్టీలో చేరారని తెలిపారు. పార్టీలో చేరిన వారికి అశోక్ జెండాలు కప్పి ఆహ్వానించారు. సీనియర్ నాయకులు గోవన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సనప పొమ్మయ్య, బాబన్న, జోగ రణధీర్, జీవన్, రాంబాబు, రామచంద్రు, శ్రీను పాల్గొన్నారు.

### శ్రీవాసవి దేవాలయంలో లక్ష పుష్పార్చన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో పుష్యమాసం సందర్భంగా మంగళవారం లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుడు తాటిపాముల దుర్గాప్రసాద్ విష్ణుపారాయణం, లక్ష పుష్పార్చన పూజలతో అమ్మవారికి అలంకరణ చేశారు. అనంతరం భక్తుల కు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఇమ్మడి రవికుమార్-గీతారాణి, చౌడవరపు మంజువాణి, సోమ చంద్రకళ, ఇమ్మడి జ్యోతి పాల్గొన్నారు.